తుప్పర తుప్పర ముసురు పడుతంది...
అంతా ఇసుకుడిసుకుడు...మటన్ మార్కెటంతా గెదడు వాసన...
ఓ దిక్కు కటిక పోరగాళ్లు పంపు స్టవ్‌ల మీద కాళ్లు, తల్కాయలు కమిరిస్తున్నరు... అట్నుంచి కమురు వాసన..
ఖీమ కొడుతున్న టకటక శబ్దాలు...తరాజుల చప్పుల్లు జోరందుకున్నయి...
శ్రావణ మాసం పోయింది. ఇంట్లో పూజల్లోని సప్పబడిపోయిన నోర్లన్ని మసాల కూరల కోసం ఆవురావురంటున్నయి..
కిలోకి నూట అరవై రూపాయలైనా గిరాకి తగ్గుతలేదు.



# కటికోడు

కె.వి.నరేందర్

రాజలింగడు రెండు పోతుల్ని కోసిండు... తోలుతిత్తి దీసినంక ఒకదానికి లోపల బొబ్బ రోగం తగిలినట్టు కనపడ్డది. గొల్ల కొమురయ్య మోసం చేసి ఆ పోతుని అంటగట్టిండని అర్థమైంది. అయినా కొనంగ లావట్టి చూసిండు...మంచిగనే బరువనిపిచ్చింది. కోసినంక సప్పలు సన్నవడ్డయ్... గుర్జెలు గుర్తుపట్టరాకుంట అయినయ్. కార్జెమ్ పచ్చవడ్డట్టయింది. వాటిని చూపించుకుంటనే కూరంత అమ్ముడాయె. మాంసం జలుగురువట్టినట్టయింది. పైసలు ముందుగాల్నె తీసుకున్నడు. ఇప్పుడు చెప్పినా పట్టిచ్చుకోడు.

'కూర అమ్ముకున్నంక గట్లనే మాట్లాడ్తరు...కటికోన్ని నమ్ముతారా? కనికరం లేనోళ్లు' అంటరు. గిరాకి సన్నపడ్డది... ఇనుప గొలుసుకు తగిలేసిన మాంసానికి బొచ్చెం బొక్కలు తప్ప... సప్పల కండ కనవడ్తలేదు.... చూసినోల్లు చూసుకుంటనే పోతుండ్రు. ఎంత పిల్చినా పట్టించుకుంటలేరు...

'కొమరుడు ఎంత పని చేసిండు...బొబ్బ రోగందని చెప్పకపాయె' రాజలింగం మనసు తల్లడిచ్చింది.

నాల్రోజులు దాచి అమ్ముకునే వృత్తి కాదాయె...చెడిపోతే పారెయ్యడానికి పండ్లు ఫలాలు కాదాయె...పది రూపాయల మాలు కాదాయె....

మొన్నటి దాకా శ్రావణమాసమని గిరాకి లేకపాయె...బేస్తవారం, శనివారం ఒక్కపొద్దు లెక్కువై ఇంకా తగ్గింది... ఆదివారం తప్ప మిగతా రోజుల్లల్ల ఎప్పుడు కోసినా ఈగలు కొట్టుకుంట పొద్దంత కూసుండుడే...పొద్దు నడినెత్తికెక్కంగ...వల్లిపోయిన మాంసమని కిలకు యాభై చొప్పున పారేసిన రోజులున్నయి. ఈ ఒక్క ఆదివారమన్నా గిరాకీ తగిల్తే పూటకెల్తది...లేకపోతే వారంల సగం కడుపుకు తిన్నట్లే...కటికోనికేంది...మిగిలిన మాంసంతోని రోజూ పండుగనే అని జనం అనుకుంటరు. బెస్తోల్లు చాపల

కూర వండుకున్నట్టు...కటికోనింట్ల మాంసం కూర రుచుండది...పచుండది....

రాజలింగం కంత కడుపు ఊదువట్టినట్లుంది...

మనసంత బెగడు పట్టినట్లుంది...

మస్కుల లేసి పోతుల్ని పొట్టేల్లని కోసి, నెత్తురు వట్టి, తోలు తీసి, పేగులు కడిగి పొద్దుపొడిసె వరకు మార్కెట్లకు చేరినా...బతుకు బొగడ మీద బొగ్గులేరుకున్నట్లే...అనిపిచ్చింది.

పదో తరగతి చదివే కొడుకు ఈ అయితారం తల్కాయ కాళ్ల కమిరిచ్చుకుంట వందరూపాయ లన్న సంపాదిస్తుండు...పెద్ద కొడుకు జంబిగద్దె దగ్గర మటన్ టేల పెట్టుకుంటడు. అల్లుడు బీట్ బజారు పక్కన టేల పెట్టుకున్నడు. అందరూ అలగ్ సలగే... ఇంట్లో ఆడదానికి ఎప్పుడు రోగాలే నాయె...రోజు మటన్ తినుకుంట రోగాలేందే? అని సుట్టుపక్కలోల్లు నవ్వుకుంటరు.

ఉడుకబెట్టిన రక్తాన్ని(నల్ల) అంచెల పోసుకొని మోత్కాకుల్ల పెట్టి రెండ్రూపాయలకు ఆకునిండ పెట్టుకుంట మోచివాడల కూసుంటది తల్లి ముసల్ది. డెబ్బయ్యేళ్లచ్చినా దాని కట్టం తప్పకపా యె...కటికోని బతుకు గజ్జల్ల గగ్గోడు పుట్టినట్టేనా యె...పైకేం కనపడుతది?

రాజలింగంకు తన దగ్గరికే వస్తున్న బుచ్చన్న కనపడ్డడు... గిరాకి వస్తుందని సంబుర పల్లేదు... బుచ్చన్న సంగతి తెల్సు...

తీసుకొనేది పావుకిలో...అదెయ్యిరా ఇదెయ్యిరా అని వేయించుకునేది అద్దకిలో...తరాజుల నీళ్ల కొట్టనియ్యడు. పాసంగం లేదని పావుకిలో బాట్లని పదిసార్లు తిరుగేత్తడు.

''ఏందిరా లింగం....తప్పిపోయిన గొర్రెలెక్కనె బెంగటేలి కూసున్నవ్'' అనడిగిండు. కొక్కానికి వేలాడదీసిన సప్పను మల్లేసుకుంట...

''కూర మంచిది...తీసుకోయె'' అన్నడు రాజ లింగం కత్తిదీస్కుంట.

''ఎక్కడిదో మంగురు పట్టినదాన్ని కోసిన వేంరా...అన్ని బొక్కలే వున్నయి'' అనుకుంట అటు ఇటు తిరగేసి 'అద్దకిలో ఇయ్యి' అన్నడు.

రాజలింగం మేక మాంసం మెడ దగ్గరిది కొయ్యబోతే ''గదేందిరా..గీ సప్పలకెల్లి ఇయ్యి...కా ర్జాలకు నీళ్లు పట్టినట్టున్నవ్... ఉబ్బినయ్'' అన్నాడు. రాజలింగం ఇక తప్పదన్నట్టు సప్పకా డిది కొంచెం, మెడదగ్గరిది కొంచెం కోసి తరాజుల వేసిండు. మోకాలి మీది బొక్కకొట్టబోతే...''గా బొక్కలేందిరా...తియ్...గా గుర్దె కొసెయ్... కార్జం ఏసుటానికి ధైర్నమస్తలేదురా'' అన్నడు.

''నల్లిబొక్కనయ్యా...మంచిగుంటది'' బుచ్చన్న మొత్తుకుంటున్నా రెండు మూలుగు బొక్కలు వెయ్యనే వేసిండు...అయినా బుచ్చన్న తరాజుల కెల్లి వాటిని దీసి పక్కన పారేసిండు.

''నిమ నిమాలు జోకవడ్తివేందిరా...బొక్కలు బొరిగలు ఏసుకుంటనే...గిదెయ్యి'' అని మెత్తటి ముక్కదీసి తరాజుల వేసిండు.

అప్పుడే సుజుకి మీద ఖాసిం భాయ్ అచ్చిండు...తెల్లటి పూనప్యాంటు మీద మెరిసి పోయే తెల్లటి లాల్చీ వేసిండు... గడ్డం మీసాలకు కలరేసిండు...పది వేల్లకు ఎనిమిది ఉంగరా లున్నయి...వెంట వున్న ఇద్దరితోని తోల్లు బేరం చేసుకుంట తీసుకుపోతండు.

''మీ కటికోల్లకన్న...తోళ్ల బ్యారగాల్లు నయమంట్రేందిరా..'' అన్నడు బుచ్చన్న

''చాలీచాలని సంసారం...వచ్చేదాకా దుఃఖం అన్నట్టేనాయె మా బతుకులు'' కత్తి తోని ఒడుపుగా ముక్కలు కొట్టుకుంట అన్నడు రాజలింగం

''రొట్టెలోని కంటె తునకలోడే నయం అన్నట్టుంది...థిల్లి కనవడ్తలేదేందిరా...చాప కింద గుల్లల దాచిపెట్టినవా...తియ్యరాదు'' అనుకుంట గుల్లల వున్న సప్పను తీసి తరా జుల వేసిండు రాజలింగం ఇక చాలన్నట్టు జోకి చూసిండు...అద్దకిలోకి ఎక్కువనే వుంది...తరాజు దింపి ముక్కలు కొడు తుంటే....

''తరాజు లావట్టకనే పోతివి...అద్దకిలో అయిందారా...మల్లజోకు''అన్నడు. రాజ లింగం మల్లజోకిండు

''ఇంక దూగనే లేదు...గా మెడకిందిది కొంచెం కోసెయ్యి'' అని సంచి పట్టిండు. రాజలింగడు మటన్ కొట్టి కవర్లో వేసి సంచిలో వేసిండు. బుచ్చన్న పైసలిచ్చినంక లెక్కపెట్టుకున్నడు.

''డెబ్బయే ఇచ్చినవ్... అద్దకిలోకి ఎనభై కదా'' అనడిగిండు.

''సాలు తియ్యవోయ్!...నీ మటనె ట్లుంది? అద్సరే...కొంచెం దొబ్బకొసెయ్యి రా...అట్లనే అప్పుడు దీసిన గా మూల్గుబొ క్కలు పారెయ్యి...కొవ్వు పేగులు రెండన్న ఎయ్యకపోతివిరా...గిట్లయితే నీ దుకానానికి రా బుద్దికాదు.'' అనుకుంట అన్నీ వేయించు కున్నడు.

రాజలింగడిలో ఏదో అసహనం...

వీళ్ల పీక్కుతినేది... ఎవరి మాంసాన్నిరా దేవుడా అనుకున్నడు. ఖాసిం రాగానే రెండు తోల్లు దీసిచ్చిండు.

''ఖాసీమ్ బాయ్..బ్యారం జోరుగున్నట్టు న్నదే'' అన్నడు

''ఏం బ్యారమే...నమ్మిన బర్రె పోతుదు డ్డెను పెట్టినట్టే వుంది. ముందు ముందు ఎట్లుంట దో...'' అనుకుంట తోలుకు అరవై చొప్పున రూపా యిలు లెక్కబెట్టిచ్చిండు.

''ఎనభై చొప్పున తీసుకోరాదే...చేసుకున్నోని పెండ్లాం నోసుకున్నోని పాలు అన్నట్టు చెయ్యవడ్తివి'' అన్నాడు.

''నాది మారు బ్యారమేనాయె...నాకు తోలుకు పదిరూపాయలన్న మిగుల్తలేదు'' అన్నడు.

''మరి మస్కట్లనే వుండకపోయినవ్...గీడేం పాడైందని అచ్చినవ్...'' అన్నడు తీగురంగ

''వన్నెలకు వైకుంటం పోతె ముసలి మొగున్ని మొసలెత్తుకుపోయిందట... అక్కడేం పాడైందే..''అ నుకుంట పోయిండు.

''తోలుకు వందన్నా దక్కకపాయె...బతుకుపా డుగాను... ఎల్లకాలం చెర్ల పడ్డోన్ని తీసి బాయిలేసి నట్టేనాయె..''అని గులుక్కున్నడు.

''బోటికూర ఎట్లిత్తునవే రాజన్న...''రాయ నర్సు రాంగనే అడిగిండు.

''కిలో డెబ్బయ్...''చూడకుండానే చెప్పిండు

''ఎక్కడిదిరా...పోయినవారం నలుపైకే ఇస్తివి... ఇప్పుడు డెబ్బయ్‌కచ్చిందా?''

కూరగాయలు కొనుక్కుని రెండు గంటలాగి వస్త తియ్...మటనంత పోయినంక నువ్వే ఇస్తవ్'' అనుకుంట పోతుంటే రాయనర్సుని పిల్చిండు.


''ఎప్పుడైతేందే...తీసుకపో.. ఇగ యాభై ఇయ్యి'' అన్నడు.

''నలుపైకి రూపాయి ఎక్కువియ్యి'' రాయ నర్సు అదే పట్టుదలతో చెప్పిండు. పేగులు, కొవ్వు కాలో జోకియ్యంగనే...ముసల్దాని కోసమని పావు



జింగ్ బెల్స్

ఆమె ఎవడ్ని పెండ్లిచేసుకుంటే మనకెందుకూ అనుకోలేం కొన్నిసార్లు. తన అందచందాలతో సినిమా ప్రేక్షకులతోపాటు, టీవీ వీక్షకులనూ ఊరడించిన పెరిజియాద్ జొరాబిన్ ఇప్పుడు లవ్‌లో పడినట్టు తెలిసింది. ముంబయ్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పేరుపొందిన బోమన్ ఇరానీని పెళ్లిచేసుకోబోంది. త్వరలో మా ప్రేమకి శుభం కార్డు వేయనున్నామని, జంటగా మీ ముందుకు రాబోతున్నామని చెప్పుకొచ్చింది. బోమన్ ఇరానీ అయితే హనీమూన్ ఎక్కడ చేసుకోవాలా అని తెగ ఆలోచిస్తున్నాడుట. పెళ్లయిన తరువాత నటించడం డౌటే అని చెప్పుకొచ్చింది జొరాబియన్!




కిలో ఖీమ కొట్టిచ్చుకున్నడు. పేరుకు బోటీకూరే గని...మాంసం ఎక్కువే వేయించుకున్నడు.

మల్ల గిరాకి సల్లవడ్డది...ముసురెక్కువైంది. అయినా... ఎదురంగ సుధాకర్‌గాని టేల కాడ గిరాకి వశపడ్తలేదు. వాడు ఊరిచ్చేటట్టు పొట్టేలు తల్కాయలన్ని లైనుగపెట్టిండు. ఇద్దరు మటన్ కొట్టేటోల్లు...పెద్దోల్ల గిరాకి అంద అటేపోతంది.

పోలీసు రమేషు ఇటు వచ్చుడు చూసిన రాజలింగం పానం ఎల్లుకపోయింది. అమీన్‌సాబ్ కుక్కకు మటన్ పెట్టాలె... ఇయ్యాల్ల తనవంతే అని మర్చిపోయిండు. అమీన్‌సాబ్ ఎట్లుంటడో... ఆయినె కుక్క ఎట్లుంటదో ఎన్నడు సూల్లె... కాని రోజుకో కటికోని దగ్గర్నుంచి...అద్దకిలోనన్న బొక్కలు, మాంసం పోతయ్...

ఒక్కసారి ఎందుకు పెట్టాలె అన్నందుకు పోలీసోల్లు పిలిపిచ్చి కొట్టినంత పనిచేసిండ్రు...

''ఏమన్నా మాకు పెడ్తున్నరా? కుక్కనేనాయె..అదేమన్న మంచి మటనా? మక్కిలిరగ్గొడతం బిడ్డె.'' అని బెదిరిచ్చిండ్రు. ఇక అప్పట్నించి ఆనవాయితీ లెక్కనే అయింది. కటిక సంఘంల లొల్లి అయినప్పుడు టేషన్‌కు పోతె వంతుల లక్కన పంపాలె అని చెప్తే కేసు పెడ్తరన్న భయానికి ఒప్పుకున్నరు. అప్పట్నుంచి గాచారం తప్పక గడీలకు పోతే ఆచారం తప్పక అణుగవెట్టినట్టయింది.

రమేష్‌ని చూసి నమస్తె పెట్టిండు రాజలింగం.

కొన్ని బొక్కలు, మెడదగ్గర మాంసం కొంచెం దొబ్బకొట్టి పావుకిలో పైనే కవర్‌లో వేసిచ్చిండు.

''నాకో అద్దకిలో కొట్టురా...ధిల్లి, లివరు, కిడ్నీలు కొట్టు...'' హుకుం జారీ చేసినట్లే అన్నడు. మాంసం ముక్కకూడా వేయించుకోలే...అద్దకిలో జోకకుండానే కవర్‌లో వేసిచ్చిండు. పోలీస్ రమేష్ యాభై రూపాయల నోటు చేతిలో కుక్కి చూడకుండా తిరిగిపోయిండు...

రాజలింగం కసిగా తిట్టుకున్నడు.

అది 'స్పెషల్ మటన్' కిందయితే అద్దకిలోకి నూటిరవై రావాలె...అనుకున్నడు.

మల్ల గిరాకి తగ్గింది...గొల్లకొమురడు బొబ్బ రోగం దాన్ని అంటగట్టి ఎంతపని చేసే అనుకుంట...కండ్లు పత్తికాయలు చేసుకొని గిరాకి కోసం కూసున్నడు.

ఈగలు జెబ్బుమంటున్నయ్...

చిరుగుల చాప మీద...కత్తి దెబ్బలు తిన్న కటిక మొద్దు లెక్కనే మనసంతా గాట్లుపడ్డట్టుంది. తోలు తీసిన కళేబరం లెక్క పచ్చిపచ్చిగుంది.

''ఏందిరా...బీరిపోయినవ్'' అన్నమాట విని తేరుకున్నడు. ఎదురుంగ చంద్రయ్యా సార్...

'అయ్యా...నమస్తే...' ఉలిక్కిపడ్డట్టు చెప్పిండు. చంద్రయ్యాసార్ అదేం పట్టించుకోకనే...వేలాడుతున్న సప్పుని ముట్టి చూసి ''బొబ్బ రోగమచ్చిందాన్నికోసినట్టున్నవ్-కదరా...రేపు సిటీల కక్కుడు బైలు పెడితే...గొడ్ల డాక్టర్ గాడు సర్టిపికెట్ ఎట్లిచ్చుండని నా మీద ఇరుసుకు పడ్తరు... ఒక్కదానికి సర్టిపికెట్ తీసుకొని నాలుగైదు కోసుడు మీ కటికోల్లకు బాగా అలవాటైంది. సట్‌పికెట్ తీస్కున్నవా.'' అనడిగిండు తీగురంగా...

రాజలింగానికి పంచెడి పానాలు ఎల్లిపోయినయ్...

''గొల్లకొమురుడు తక్లీబ్ చేసిండయ్యా'' అన్నడు భయం భయంగా...

''ఎవడు...చిల్వకోడూర్ కొమురడేనా? వాని మూడువందల గొర్లకు చిటుకు రోగమొస్తే నేనే కాపాడిన...రెండు గొర్లిచ్చిండు. నట్టల మందేస్తే నయాపైసియ్యలే...'' అన్నడు. గొడ్ల డాక్టర్ రెండు మేకల మందల్ని సంపాయించిండు. ఒక్కో మందల అరవై, డెబ్బయికి తక్కువుండయి.

''నీ దగ్గర మటన్ తీసుకునేటట్టు లేదు కదరా...'' అన్నడు గొడ్ల డాక్టరు. మార్కెటంతా కలియజూస్తూ...

''ఇయ్యాల కూర మంచిగలేదయ్యా...'' అనుకుంట అంగి జేబులకెల్లి వందరూపాయల నోటు తీసిచ్చిండు. వాటినందుకొని జేబులో పెట్టుకుంట ''ఇంకోసారి మంచిది కొయ్యి..రోగం లేదని మేం ఫిట్‌నెస్ సట్‌పికెట్ ఇయ్యాలె...మీరు గిట్లాంటియి కోసి బద్‌నాం చేస్తరు'' అనుకుంట వెంకటేశం టేల దిక్కుపోయిండు.

నిజానికి చంద్రయ్య వెటర్నరీ డాక్టర్ కాదు...లైవ్ స్టాక్ అసిస్టెంటు! ఆయన కనవడుడు జూసి రామన్నగాడు ధిల్లీలు, గుర్దెలు తీసి గుల్ల కింద దాసిండు.

రాజలింగం గుండెల్ల దిమ్మిసతోని గుద్దినట్లయింది...తమ బతుకుల్ని ఎవలో ఖీమగొడ్తున్నట్లే అన్పిచ్చింది. అయ్యవారు ఆకుల్నాకంగ దాసరి ప్రసాదమడిగినట్టు..చీరుకు తింటున్నరు అనుకున్నడు.

మార్కెట్ గేటుకాడ...జీను ప్యాంటు మీద నల్లటి టీషర్టు వేసుకొని టిప్పుటాపుగా కన్పిచ్చిండు శేఖర్ సార్.

ఆయనంటే కటికోల్లందరికీ హడల్...మున్సిపల్ ఆఫీస్‌ల సానిటరీ ఇన్‌స్పెక్టర్...దాదాపుగా మార్కెట్లకు రాడు. మున్సిపల్‌లో పనిచేసే పారిశుధ్యం పని వాళ్లల్లో ఎవడ్నో పంపిస్తాడు..ఫలానా కటికోడు మటన్ ఇస్తాడని...

ఒక్కసారి సాయిలుగాడు మటనెందుకియ్యాలె అని ఆయనతోని డైరెక్టుగా లొల్లి పెట్టుకున్నందుకు...అది మనసుల పెట్టుకున్నడు. వారం తిరిగేలోపల మున్సిపలోల్లు దాడి చేసినట్టే వచ్చిండ్రు...

మార్కెట్ మీద పడ్డరు...

ఈగలు...దోమలు...రొచ్చు...వెంట్రుకలు..మార్కెట్‌లో పరిశుభ్రత లేదని ఇరుసుకపడ్డరు.

మటన్ మీద ఫినాయిల్ లీటర్లకొద్ది కుమ్మరిచ్చిండ్రు

కేసులు బనాయిస్తమని బెదిరిచ్చిండ్రు...ఫినాయిల్ కుమ్మరిచ్చిన మటన్ ఎవలు కొంటరు... ఆరోజు ఒక్కొక్క కటికోడు రెండు వేలకు తక్కువ లాస్ కాలే.... అంతటి ఇషపాత్కపోడు...

అప్పట్నించి కటికోల్లు మెత్తవడ్డరు...వంతుల వారిగా మటన్ పోతది... ఒక్కోసారి ఈయనే మంచితనం కోసం, మెయిర్బానీ కోసం చైర్మెన్ ఇంటికి కమీషనర్ ఇంటికి పంపిస్తడు.

శేఖర్ సార్...రాజలింగం టేల ముందు నుంచి పోతుంటే.... ఎక్కడాగుతడోనని భయంతోని మొకం పక్కకు తిప్పుకున్నాడు. గుడ్డికొంగకు కొర్ర మొట్టి దొరికినట్టు సుధాకర్ షాపు కనపడ్డది. ''సుధాకర్...మంచిగున్నవా?''అన్నడు ప్రేమగా... వాడు 'రండ్రి సార్' అని మంచి మంచిది కొట్టించ్చిండు...పోసిని పోషవ్వా అంటే.... చెవి కమ్మలు దీసి చేతిల పెట్టినట్టు ఉబ్బిపోయిండు. మళ్లీరాజలింగం ఈగలు కొట్టుకుంట కూసున్నడు... మసురు తగ్గు ముఖం పట్టింది. మాంసం ఎండుక పోతంది...అప్పుడప్పుడు నీల్లు చల్లుతుండు... లక్ష్మింపతి కనపడ్డడు. కూరగాయలు కొనుక్కొని ఇటే వచ్చిండు.

''పావుకిలో ఖీమ కొట్టియ్యిరా రాజన్నా...'' అన్నడు యాభైనోటు ఇస్తూ...

''వద్దే అన్నా నీ దగ్గర పైసలు తీసుకుంటనానె? వద్దుగని...'' అని టకటక ఖీమ కొట్టిచ్చిండు... ఇలా అన్నాఅనకపోయినా లక్ష్మింపతి పైసలియ్యడని తెల్సు. ఇరవై వేలు బాకియ్యాలె...నెలనెల మిత్తి తీసుకుంటడు. మటన్ పెట్టకపోతే పైసలడుగుతడని భయం. లక్ష్మింపతి యాభై నోటు జేబులో పెట్టుకున్నడు.

''అన్నా...మొన్న మేం దేవుని పెట్టుకున్న రోజు కిలో మటన్ పంపిన...ముట్టిందానే'' అనడిగిండు రాజలింగం.

''ఏం కూర పంపినవ్‌రా...ప్రేమగల్ల మొగుడు పెసరగాయ పంపితే గిరిగిరి ప్రాణం బాయె అన్నట్లు...గంత ముదురుదారా పంపితే...'' కనీసం కృతజ్ఞత లేకుండా కొట్టిపారేసిండు లక్ష్మింపతి.

రాజలింగం పానాలు అవిసిపోయినయ్...

ఏమైనా అంటే...బాకీ అడుగతాడు. ఏం మాట్లాడలేదు. లక్ష్మింపతి వెళ్లిపోయిండు.

పదకొండు దాటుతోంది.

కొందరు మటన్ అయిపోయి టేలాలు మూసేత్తుండ్రు...కాల్లు తల్కాయలు కమిరిచ్చే కాడ గిరాకి అయిపోయింది. పంపుస్టవ్‌లు బందు చేసి పోరగాల్లు పైసలు పంచుకుంటుండ్రు.

సగం మార్కెట్ ఖాళీ అయింది...

రాజలింగం దగ్గర ఇంకా మాంసం అట్లనే వుంది... ఒకరిద్దరు వచ్చి చూసినా బాగా లేదని పోయిండ్రు...తక్కువకిస్తానంటే ఒకాయిన వచ్చిండు...

కిలో నూర్రూపాయలకే ఇచ్చిండు...

ఆదివారం కాబట్టి హోటలోల్లు దాబాలోల్లు కూడా రారు....

మళ్లీ ఎదురు చూపులు... ఈగలన్నీ ఇక్కడికే చేరినయ్...

రాజలింగంకి కూరెట్లపోవాలె...పెట్టుబడన్నా రాకపోయె...అన్న మనాది పట్టుకున్నది...

బతుకు మీద రోత పుట్టింది...

కటిక కులంలో పుట్టినందుకు తిట్టుకున్నడు....

కులం అంటే యాదికచ్చింది...

కటికవాడు... అంటే కసాయి వాడు... అని కదా అర్థం..

మరి కులాన్ని పక్కన బెడితే....

బొబ్బరోగం దాన్ని అంటగట్టిన గొల్ల కొమురయ్య...పోలీస్ రమేషు...తోల్ల బేరం చేసే ఖాసిం... గొడ్ల డాక్టరు చంద్రయ్య...సానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్ సారు...బాకీలిచ్చే లక్ష్మింపతి...

వీళ్లంతా... ఎవలు??

మేకనో, గొర్రెనో కొనేవాడు కటికోడు....

మరి మనుషుల్ని, మనుషుల జీవితాల్ని పీక్కు తినే వీళ్లనేమనాలి???

రాజలింగం ఆలోచిస్తున్నాడు...

★

